క్లుప్తంగా

నేడు డయల్ యువర్ కమిషనర్

తిరుపతి తుడా: తిరుపతి నగర ప్రజలు డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం, అదేవిధంగా అర్జీలు, ఫిర్యాదులు ఇచ్చే వారి కోసం ఉదయం 10.30 గంటల నుంచి 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని తెలిపారు. ఫోన్ ద్వారా ఫిర్యాదులు చేసే వారు 0877-2227208 నంబరుకు కాల్ చేసి మాట్లాడవచ్చని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆమె కోరారు.

28, 29 తేదీల్లో ఎస్ఎఫ్ఐ మహాసభలు



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో ఈనెల 28, 29 తేదీల్లో జరగనున్న ఎస్ఎఫ్ఐ 5వ జిల్లా మహాసభలకు సంబంధించిన పోస్టర్లను వర్సిటీలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా మహాసభలను విద్యార్థులు జయప్రదం చేయాలని కోరారు. సభల్లో విద్యార్థుల సమస్యలపై భవిష్యత్ కార్యాచరణ ప్రకటించడం జరుగుతుందన్నారు. పాఠశాల, ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలు, విద్యార్థులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సదుపాయాలు, కళాశాలలో సీట్ల భర్తీ ప్రక్రియ, మౌలిక సదుపాయాల కల్పనపై నినదిస్తామన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ కార్యదర్శి వినోద్, జిల్లా సహాయ కార్యదర్శి బాల, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీఎస్ఎఫ్ నాయకులు

తిరుపతి సిటీ: రాజమండ్రి ఆదికవి నన్నయ వర్సిటీ వేదికగా ఫిబ్రవరి 5, 6వ తేదీల్లో జరిగే జాతీయ స్థాయి గిరిజన సాంస్కృతిక మహోత్సవాలను జయప్రదం చేయాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు కరంసి అక్కులప్ప నాయక్ కోరారు. ఈ మేరకు ఆయన గిరిజన నాయకులతో కలసి ఆదివారం ఎస్వీయూ ప్రధాన ద్వారం వద్ద సాంస్కృతిక మహోత్సవ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఒక భాగంగా ఉన్నాయన్నారు. వాటిని పరిరక్షించే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనని తెలిపారు. గిరిజన చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకునేందుకు జాతీయస్థాయిలో నిర్వహించే ఈ గిరిజన సాంస్కృతిక మహోత్సవాల్లో పలు రాష్ట్రాల నుంచి గిరిజన కళాకారులు ఆదివాసులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో టీఎస్ఎఫ్ నాయకులు డాక్టర్ మహేందర్ నాయక్, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, చిరంజీవి, మల్లేష్ నాయక్, జగన్ నాయక్, నాగేంద్ర నాయక్, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



జానపద నృత్య ప్రదర్శనలో కళాకారులు

చంద్రగిరి: తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. వారాంతపు కార్యక్రమంలో భాగంగా చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లికి చెందిన కళాతరంగిణి సంస్థ బృందం ఆధ్వర్యంలో జానపద నృత్యాలను ప్రదర్శించారు. ఇందులో భాగంగా గణనాయకాయ భక్తిగీతం, బృందావనికి చిందులు నేర్పే భక్తి నృత్యాలు, వనారమ్మ వనారే, నేలతల్లి గుండెల్లో, అందాల నరసమ్మో, గోదారిగట్టు మీద రామచిలకవే, భజరే నందగోపాల, ఎట్టా చెప్పను బావ, మందులోడా ఓరి మాయలోడా, రాను రానంటూనే చిన్నదో, అందమైన దాన చందమామ, వేడుకుందామా వెంకటేశ్వరుడిని వంటి పాటలకు కళాకారులు రమ్య, భార్గవి, భరత్, బిందు, శృతి, బిందుశ్రీ, హేమావతి, మేఘన, హేమలత, శైలజ, భూమి, కార్తీక్, కుశాల్, మణికంత, హేమచరణ్, గురుప్రియ, సుదర్శన నాట్యప్రదర్శన చేశారు. వారి అభినయానికి మంత్రముగ్ధులైన ప్రేక్షకులు కరతాళధ్వనులతో అభినందనలు తెలిపారు. అనంతరం ఏఓ ఖాదర్‌వల్లీ కళాకారులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.



స్థానికం.. నిర్వీర్యం!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తోంది. స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తూ.. ప్రజాప్రతినిధులను అవమానిస్తోంది. పైగా అధికార దర్పంతో పల్లెల్లో పచ్చ నేతలే అనధికార పాలన సాగిస్తున్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు కూడా తెలియకుండానే పనులను సైతం వారే చేయిస్తూ నిధులు కాజేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు ఈ దమ్మీ నేతలకు వత్తాసు పలుకుతుండడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- పంచాయతీల్లో కూటమి నేతల అనధికార పాలన
- సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు తెలియకుండానే పనులు
- గ్రామ నిధులతో చేసే పనులకు కూడా పచ్చమంద గ్రీన్‌సిగ్నల్ ఇవ్వాలని హుకుం
- చంద్రగిరిలో ప్రజాప్రతినిధి ఇంటి నుంచే ఆదేశాలు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం



గాంధీపురం సచివాలయం

తిరుపతి రూరల్: గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేస్తూ కూటమి ప్రభుత్వం మరో కొత్తరకం దందాకు తెరలేపింది. ప్రజల చేత ఎన్నుకోబడిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలను కాదని తమ పార్టీ నేతలతో అనధికార పాలన సాగిస్తోంది. అందులో తిరుపతి రూరల్ మండలంలోని ప్రజాప్రతినిధి ఇంటి నుంచి ఎలాంటి అభివృద్ధి పనులకు సంబంధించి అయినా పేర్లు కవర్లో రావాలనే టాక్ చంద్రగిరి నియోజకవర్గంలో విస్తృతంగా నడుస్తోంది.

అనుమతులు లేకుండానే..

గతంలో పంచాయతీల్లో ఎలాంటి అభివృద్ధి పనులు జరగాలన్నా వార్డు సభ్యులు అందరూ కలిసి పంచాయతీలో తీర్మానించి, సర్పంచ్ ఆధ్వర్యంలో చేసేవారు. ఆ తరువాత పనులు పూర్తి చేసేవారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా మారిపోయింది. నియోజకవర్గంలోని పంచాయతీల్లో 90 శాతం ప్రజాప్రతినిధులు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులే ఉండడంతో వారికి మింగుడు పడలేదు. దీంతో పంచాయతీల్లో ఎలాంటి తీర్మానాలు.. అనుమతులు లేకుండా పనులు చేస్తున్నారు. అది కూడా దొడ్డిదారిన పనులు చేపట్టి బిల్లుల కోసం కక్కుర్తి పడుతున్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో సంబంధం లేకుండా పంచాయతీ కార్యదర్శులు, వెండర్స్ పేరుతో కూటమి చోటా నేతలతో కలిసి పనులను అమ్మేసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ఆపై తీర్మానం కాపీ కోసం పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి చేస్తున్నారు. ఇవ్వకపోతే బెదిరింపులకు దిగుతున్నారు. దీంతో పంచాయతీ వ్యవస్థ భ్రష్టు పడుతోంది.

ఆమోదం తెలిపాం..ఎవరు చేస్తున్నారో ?



నా పంచాయతీ పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.87.50లక్షలను మంజూరు చేసింది. పనులకు సంబంధించి పంచాయతీ తీర్మానం కోరారు. దీంతో పంచాయతీ పాలకమండలి సమావేశం నిర్వహించి పనులకు సంబంధించి తీర్మానం చేశాం. ఆపై పంచాయతీ కార్యదర్శి పంచాయతీ తీర్మానం పత్రాన్ని తీసుకున్నారు. పనులు ఎవరికి ఇస్తున్నారని, అడిగితే అది వేరే వారు చేసుకుంటున్నారు మేడం అంటూ మాట దాట వేశారు. ప్రజల చేత ఎన్నికైన ప్రజాప్రతినిధులకు కూడా తెలియకుండా ప్రభుత్వ పనులను ఇతర వ్యక్తులకు ఇచ్చారు. గతంలో ఎప్పుడూ ఈ తరహాలో పంచాయతీలో పనులు జరగలేదు. ప్రజాప్రతినిధులనే గౌరవం కూడా పాటించకుండా పనులు చేయడం సబబు కాదు.

– రాగిణి సాగర్, సర్పంచ్, చిన్నరామాపురం

బెదిరిస్తున్నారు..



మండలంలో పంచాయతీల పాలనను నిర్వీర్యం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులకు తెలియకుండా పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీలతో సంబంధం లేని వ్యక్తులతో కలిసి పనులను పంచుకుంటున్నారు. తీర్మానాలు లేకుండా అడ్డగోలుగా చేసిన పనులకు తీర్మానాలు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారు. అడిగేవారు లేరని వేధిస్తున్నారు. గానుగపెంట పంచాయతీలో రోడ్డుకు ఇరువైపులా చెట్లను తొలగించే పనులను టీడీపీ నాయకులు అనుమతులు లేకుండానే చేశారు. ఈ పనులకు సంబంధించి పంచాయతీ నిధులు మంజూరు చేయాలని, అందుకోసం తీర్మానాలు ఇవ్వాలని వార్డు మెంబర్లు, నాపై పంచాయతీ కార్యదర్శి ఒత్తిడి తెస్తున్నారు. పంచాయతీలోని గ్రామాల్లో విద్యుత్ దీపాలు సైతం సర్పంచ్‌కు సమాచారం ఇవ్వకుండా పంచాయతీ కార్యదర్శే వేశారు. పంచాయతీ తీర్మానాలు ఇవ్వని పక్షంలో వార్డు మెంబర్లతో సహా సర్పంచులను కూడా బర్తరఫ్ చేస్తామని తీవ్రస్థాయిలో బెదిరిస్తున్నారు.

– భాగ్యలక్ష్మి, సర్పంచ్, గానుగపెంట



అ'పూర్వ' కలయిక..

శ్రీగోవిందరాజ స్వామి ఉన్నత పాఠశాలలో 2001–2002 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు 23 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. ఆదివారం దాదాపు 200 మంది కలిసి ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. ఈ సమ్మేళనంలో వారి పూర్వ ఉపాధ్యాయులను, ప్రస్తుతం ఉన్న గోవిందరాజస్వామి ఉన్నత పాఠశాల హెచ్ఎం చంద్రయ్యను ఆహ్వానించి ఘనంగా సత్కరించి వారి ఆశీర్వాదాలు అందుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆటపాటలతో తోటి స్నేహితులతో ఆనందంగా గడిపారు.

– తిరుపతి కల్చరల్

అమిత్‌షా పర్యటనపై వామపక్షాల నిరసన



కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పర్యటనను వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష నేతలు

తిరుపతి కల్చరల్: రాజ్యాంగాన్ని రచించిన బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఏపీ పర్యటనకు అనర్హుడని, ఆయనను మంత్రి పదవి నుంచి తొలగించాలని వామపక్ష నేతలు డిమాండ్ చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆంధ్రప్రదేశ్ పర్యటనను వ్యతిరేకిస్తూ ఆదివారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడుర ఎ.రామానాయుడు మాట్లాడుతూ గతేడాది డిసెంబర్‌లో పార్లమెంట్‌లో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ అని జపం చేయడం ఫ్యాషన్‌గా మారిందని, అంబేడ్కర్‌ను తలిచే బదులు ఏ దేవుడినైనా తలిస్తే మోక్షం, స్వర్గం ప్రాప్తిస్తుందంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న బీజేపీ, ఆర్ఎస్ఎస్ వైఖరిని ఈ సందర్భంగా దుయ్యబట్టారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని మోసం చేయడమే కాక విభజన చట్టంలోని హామీలను అమలు చేయకుండా దగా చేశారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నేతలు పాల్గొన్నారు.

హరిహరేశ్వరస్వామికి కుంభాభిషేకం

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పనస కోనలోని హరిహర తీర్థంలో వెలసిన హరహరేశ్వరస్వామికి ఆదివారం ఆగమోక్తంగా కుంభాభిషేకం జరిగింది. ఆలయాన్ని పునఃనిర్మించడంతో ఈ పూజలు చేశారు. ఆలయ శిఖరాలకు అభిషేకాలు చేశారు. స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యల పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని మేల్కొల్పిన దార్శనికుడు వేమన



వేమనకు నివాళులు అర్పిస్తున్న వేమన విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు, అతిథులు

తిరుపతి కల్చరల్: కొన్ని శతాబ్దాల క్రితమే తన కవిత్వం ద్వారా సమాజాన్ని మేల్కొలిపి, కుల, మత, వర్గ రహిత సమాజాన్ని ఆకాంక్షించిన మహనీయుడు వేమన అని ఎస్వీయూ పరిశోధన విద్యార్థి గరికపాటి రమేష్‌బాబు తెలిపారు. వేమన జయంతిని పురస్కరించుకుని వేమన విజ్ఞానకేంద్రంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేమన కవి తెలుగు జాతి ప్రపంచానికి ఇచ్చిన కానుకగా ఐక్యరాజ్య సమితి ప్రకటించిందని తెలిపారు. సమసమాజం కోసం కృషి చేసిన వేమన భావజాలాన్ని నేటి యువత అందుకోవాలని కోరారు. అనంతరం వేమన విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు నడ్డి నారాయణ, మోహనమూర్తి, ఆలిండియా రేడియో పూర్వ ఉపసంచాలకుడు మల్లేశ్వరరావు, తహసున్నీషా, మల్లారపు నాగార్జున మాట్లాడుతూ గొప్ప దార్శనికుడు వేమన అని కొనియాడారు. కార్యక్రమంలో ఓ.వెంకటరమణ, పంచముఖేశ్వరరావు, ఆమూరి సుబ్రమణ్యం, లక్ష్మీదేవి, ప్రవీణ్ వేమన పద్యాలను ఆలపించి ఆకట్టుకున్నారు.

రెండు ఆవులు మృతి



మృతి చెందిన ఆవులు

పాకాల : ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై రెండు ఆవులు మృతి చెందిన సంఘటన మండలంలోని పులివర్తివారిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఆదివారం స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఆదెనపల్లి పంచాయతీ పులివర్తివారిపల్లికి చెందిన మునినాయుడి పొలంలో ఆవులు మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలింది. దీంతో అతని రెండు ఆవులు మృతి చెందాయి. అయితే మునినాయుడు, జయలక్ష్మి దంపతులు వీటిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రాజగోపురానికి ఆధ్యాత్మిక శోభ



రాజగోపురంపై లేజర్ కాంతులు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద ఉన్న రాజగోపురంపై ఆదివారం రాత్రి లేజర్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. రానున్న మహాశివరాత్రి ఉత్సవాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఏర్పాట్లు చేశారు. ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా దేవతామూర్తుల చిత్రాలు ప్రజలను ఆకర్షించాయి. వీటిని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పరిశీలించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : రేణిగుంట పంచాయతీ లోని భగత్‌సింగ్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ కొల్లాపురి అమ్మవారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేక వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పూజారి నాయుడమ్మ ఆధ్వర్యంలో కలశ స్థాపన పూజ, హోమ పూజలు జరిపి అమ్మ వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అమ్మవారికి విశేష అభిషేక పూజలు చేసి శోభాయమానంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.



శ్రీ కొల్లాపురి అమ్మవారి ఆలయం (ఇన్‌సెట్‌లో) అమ్మవారు

బస్టాండ్‌లో చోరీలపై దృష్టి పెట్టండి

- ప్రయాణికుల రద్దీని గుర్తించండి
- సెక్యూరిటీకి డీపీటీవో ఆదేశాలు



ఆర్టీసీ సెక్యూరిటీకి సూచనలిస్తున్న డీపీటీఓ నరసింహులు

సాక్షి ఎఫెక్ట్..

తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో చోటు చేసుకుంటున్న పలు అంశాలపై శనివారం సాక్షి దినపత్రికలో 'దయచూపరేమి గోవిందా..'అనే శీర్షికతో కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. ఈ కథనానికి స్పందించిన జిల్లా ప్రజా రవాణా అధికారి(డీపీటీఓ)నరసింహులు ఆదివారం ఆర్టీసీ సెక్యూరిటీతో ట్రాఫిక్‌తో పాటు చోరీలకు అడ్డుకట్ట వేయడానికి చేపట్టాల్సిన అంశాలపై పలు ఆదేశాలు ఇచ్చారు. సెక్యూరిటీ ముందుగా బస్టాండ్‌లో ప్రాధాన్యత అంశాలపై శ్రద్ధ పెట్టాల్సి ఉందని సూచించారు. బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో చోరీలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సంక్రాంతి పండుగ పూర్తయిన నేపథ్యంలో నాలుగు రోజులుగా తిరుపతి బస్టాండ్‌లో రద్దీ కొనసాగుతోందన్నారు. మరోవైపు బస్టాండ్ ప్రాంగణంలో ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు పార్కింగ్ చేస్తే వారిపై చర్యలు చేపట్టాలని, గరుడ వారధిపై నుంచి వచ్చే వాహనాలకు అపరాధ రుసుం వేసే పనిలో ఉంటే ప్రయోజనం లేదని వివరించారు. ఉద్యోగ రీత్యా సమస్యలు ఉంటే ఉన్నతాధికారులతో మాట్లాడితే వాటిని తాము పరిష్కరించేందుకు ముందుంటామని వెల్లడించారు. అయితే ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఆర్టీసీ అధికారులు ఎవరూ పాల్గొనలేదు. మరో వంద రోజుల్లో ఆయన(ఏప్రిల్ 30)న ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఈ క్రమంలో ఆయన కార్యాలయానికే పరిమితం కాకుండా.. తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో ఏదో మంచి పనులు చేపట్టేందుకు కృషి చేస్తున్నారు.



తిరుపతి బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ



బస్టాండ్‌లో ట్రాఫిక్ ఇక్కట్లు